విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ ఆధ్వర్యం లో ఉండవల్లి మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని 170 మంది విద్యార్థులకు మారుతి ఫౌండేషన్ ద్వారా ఉచితంగా నోట్ పుస్తకాలు, జామెంట్రీ కిట్స్, స్లేట్స్, పెన్నులు, పెన్సిల్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో నోట్ పుస్తకాలు కిట్స్ అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శాంతకుమారి, ఎంఈఓ నాగేశ్వరరావు, లింగంశెట్టి కిషోర్ కుమార్, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు రాజా రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆన్‌లైన్ టికెట్ రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఆన్‌లైన్ టికెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను డిపో మేనేజర్ మంత్రు నాయక్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ కౌంటర్‌ను కరోనా సమయంలో నిలుపుదల చేయడం జరిగిందని, నేడు తిరిగి కౌంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్ పనిచేస్తుందన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నంతో పాటు రాష్ట్ర నలుమూలలకు ఇక్కడ నుంచి ఆర్టీసీ బస్సులు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డీజీ నాయక్, ఆర్టీసీ సిబ్బంది, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర-తాడేపల్లి : చిర్రావూరులో ఇటీవల ప్రమాదంలో గాయ పడిన మక్కే గోపి కుటుంబానికి ప్రమాద భీమా చెక్కును బుధవారం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు అందచేసారు. ఈ సందర్భంగా చిల్లపల్లి మాట్లాడుతూ జనసేన క్రియా శీలక సభ్యుడైన మొక్కే గోపీనాథ్ కొన్ని రోజుల క్రితం ప్రమాదంలో గాయపడ్డారని, గత సంవత్సరం క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్య క్రమం జరిగినప్పుడు గోపినాథ్ సభ్యత్వం తీసుకున్నారన్నారు. క్రియాశీలక సభ్యత్వం ఉండటం వల్ల గోపి కుటుంబానికి రూ.50 వేల చెక్కును జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పంపించడం జరిగిందని తెలిపారు. కార్యకర్తల మీద ఉన్న బాధ్యతతో పవన్ కళ్యాణ్ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, బడే కోమలి, మునగపాటి వెంకట మారుతిరావు, సాధు చంద్రశేఖర్, చిట్టెమ్మ అవినాష్, అంకం కాళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా కల్వర్టు

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు పట్టణం 27వ వార్డు ప్రధాన రహదారిపై కల్వర్టు పగిలిపోయి ప్రమాదభరితంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణించా లంటే వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళలో దూరప్రాంత వాహన చోదకులు గుంతలో పడే ప్రమాదం ఉంది. స్థానిక సచివాలయ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారులకు నూతన వస్త్రాలు బహుకరణ

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు పట్టణం 3వ వార్డు ఎరుకల వాడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధ వారం లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు నూతన వస్త్రా లను బహుకరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మిఠాయిలు పంచారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పొన్నూరు స్వర్ణపురి మహిళా క్లబ్ అధ్యక్షురాలు ఎం.అనసూయ దేవి మాట్లాడుతూ క్లబ్ సేవా కార్యక్రమాలలో భాగంగా నూతన వస్త్రాలను బహుకరించడం జరిగిందన్నారు. క్లబ్ సెక్రెటరీ శేష కుమారి, విజయలక్ష్మి, సూపర్‌వైజర్ కె.శ్యామల, అంగన్ వాడీ కార్యకర్త ఎంపీ సుకన్య, కె.సావిత్రి పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌లో నీళ్ల మోటార్ చోరీ

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు పట్టణం 12వ వార్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో నీళ్ల మోటర్ చోరీకి గురైంది. నీళ్ల మోటర్ చోరీకి గురై నెల రోజులు కావస్తున్న పోలీసులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటంతో వైద్యశాలకు వచ్చే రోగులు, సిబ్బంది నీళ్ల లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలని వైద్యశాల డాక్టర్ గ్రీష్మ మీడియాకు తెలిపారు.

జేసీగా భార్గవ్ తేజ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్‌గా ఎ.భార్గవ్ తేజ బుధవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు జాయింట్ కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. ఇంతకు క్రితం కర్నూల్ మున్సిపల్ కమిష నర్‌గా, కందుకూరులో సబ్-కలెక్టర్‌గా, తూర్పు గోదా వరి జిల్లాలో జాయింట్ కలెక్టర్(హౌసింగ్)గా విధులు నిర్వహించడం జరిగిందన్నారు. తన స్వగ్రామం సత్య సాయి జిల్లా, కనగానిపల్లి అని తెలిపారు. మంత్రి, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ఉద్యోగులు, మీడియా మిత్రుల తోడ్పాటుతో విధులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ప్రాధ్యానత పథకాల లబ్ధిని ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రజలకు చేరవేసేం దుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జేసీ భార్గవ్ తేజను తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి విజయ్ కుమార్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.
జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు.

మహోన్నతుడు సీఆర్‌మోహన్

విశాలాంధ్ర- తెనాలి : కళ కళ కోసం కాదు ప్రజ కోసం అనే నినాదంతో జీవితాంతం ప్రజానాట్యమండలి అభ్యున్నతి కోసం నాటిక, నాటక, వివిధ కళారూపాలు ప్రదర్శించి ప్రజా చైతన్యం కోసం కృషి చేసిన మహోన్నతుడు సీ.ఆర్.మోహన్ అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, గుంటూరు జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ నివాళులర్పించారు. తెనాలి గాంధీనగర్ ఇస్కఫ్ మీటింగ్ హాలులో బుధవారం జరిగిన సీ.ఆర్.మోహన్ సంస్మరణ కార్యాక్రమంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. కళాకారునిగా నటుడు, దర్శకుడు, వివిధ కళాసంస్థల నిర్వాహకునిగా రాష్ట్ర రాష్ట్రేతరంగా పేరు పొందారని చెప్పారు. రక్తకన్నీరు, బికారి రాముడు, అందరూ బ్రతకాలి తదితర నాటకాలను సినీనటుడు రక్తకన్నీరు నాగభూషణంతో కలిసి వందలాది ప్రదర్శనలిచ్చారన్నారు. సీపీఐ కొల్లిపర నియోజకవర్గ కార్యదర్శి బాలస్వామి మాట్లాడుతూ కృష్ణ గారితో కలిసి చిలకలూరిపేటలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారని ఆయన కార్మికుల, కర్షకులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారంలో ప్రథమ పాత్ర వహించేవారని చెప్పారు. బొల్లిముంత శివరామ కృష్ణ గారి వర్ధంతి, జయంతి కార్యక్రమాల్లో పాల్గొనేవారని ఆయన రచనలపై విశ్లేషించేవారని చెప్పారు. నిబద్ధత కలిగిన రాజకీయ నాయకునిగా కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆదర్శ కమ్యూనిస్టని ఆయనకు జోహార్లర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, వీణ, విజయలక్ష్మి, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి నిధుల కేటాయింపుపై హర్షం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహ్మద్ బేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం నిర్మాణానికి సైతం నిధులు కేటాయిస్తామని ప్రకటించడం శుభపరిణామమని అన్నారు. యువత నైపుణ్యాభివృద్ధికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారని కొనియాడారు.

ఫార్మసీ విద్యపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక హిందూ ఫార్మసీ కళాశాలలో విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించటానికి కావాల్సిన అర్హతలు గురించి ఐడీపీ ఎడ్యుకేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం బుధవారం పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐడీపీ గుంటూరు బ్రాంచ్ మేనేజర్ వి.వెంకట రమేష్, డెస్టినేషన్ మేనేజర్ పి.సాయి చైతన్య మాట్లాడుతూ విదేశాలలో ఉన్నత విద్యకు ఉన్న అవకాశాలు గురించి అప్లికేషన్ చేయటానికి కావాల్సిన సర్టిఫికెట్లు, వీసా నిబంధనలు గురించి తెలియజేశారు. విదేశాలలో విద్యను అభ్యసించటానికి అక్కడి విశ్వ విద్యాలయాలు విద్యార్థులకు ఇచ్చే పార్ట్ టైం ఉద్యోగాలు గురించి కూడా వెల్లడించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూధన రావు, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : మార్షల్ ఆర్ట్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్-2024 కరాటే, కుంగ్ ఫు, తైక్వాండ్ పోటీల్లో తమ వీఆర్ హైస్కూల్ విద్యార్థులు ఎనిమిది మంది అద్భుత ప్రతిభను చాటారని వీఆర్ హైస్కూల్ విద్యాసంస్థల అధినేత వి.వెంకటేశ్వరరావు తెలిపారు. హైదరాబాదులో జరిగిన పోటీల్లో విజయం సాధించి గోల్డ్, సిల్వర్, బ్రోన్జ్ పతకాలను సాధించి తమ విద్యా సంస్థ కీర్తి ప్రతిష్టతలను మరింత ఇనుమడింపచేశారని సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం పాత గుంటూరులోని వీఆర్ హైస్కూల్లో జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులను ఘనంగా సత్కరించారు. తమ విద్యాసంస్థలో విద్యతోపాటు క్రీడల్లో కూడా శిక్షణ ఇచ్చి వారిని దేశం మెచ్చుకోదగిన విధంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు కరుణాకర్, అశోక్ కుమార్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రాజీనామా

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య బుధవారం వైసీపీకి రాజీనామా చేశారు. గుంటూరులో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో తన రాజీనామాను మీడియా ముఖంగా ప్రకటించారు. కిలారి రోశయ్య రాజీనామాతో పొన్నూరు నియోజకవర్గంలో వైసీపీ క్యాడర్ పూర్తిస్థాయిలో కనుమరుగయ్యే అవకాశం ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రస్తుతం పొన్నూరు వైసీపీ క్యాడర్ డోలాయమానంలో ఉంది.

1998 డీఎస్సీ క్వాలిఫై టీచర్స్‌కు పోస్టులు ఇవ్వాలి

విశాలాంధ్ర-మంగళగిరి : మిగిలిపోయిన 1998 క్వాలిఫైడ్ టీచర్స్ పోస్టులు ఇవ్వాలని భైరవకోన శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం మంగళగిరి నగరంలోని ఐబిఎన్ భవన్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి 5,887 మంది 98 క్వాలిఫైడ్స్‌కు ఉద్యోగాలు ఇచ్చామని ప్రకటించి 4072 పోస్టులు మాత్రమే భర్తీ చేశారు. మిగిలిపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వికలాంగులైన 1815 మంది అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాకు న్యాయం చేయాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం వినతిపత్రాలు అందజేయడం జరిగిందని అన్నారు. మాకు న్యాయం చేస్తామని లోకేష్ చెప్పారన్నారు. మాలో ఇప్పటికే కొద్ది మంది చనిపోవడం, వయోపరిమితి దాటిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ అసెంబ్లీ సమావేశాల్లో ఒక ప్రకటన చేయాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎం.విశ్వరూపాచారి, ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతలు

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వి.వెంకటేశ్వర్లు, పరీక్షల ఇన్‌చార్జ్ కో-ఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ డి.రామచంద్రన్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్‌లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఉదయం తాత్కాలిక రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం ఆచార్య వెంకటేశ్వర్లు, ఆచార్య రామచందర్, డాక్టర్ సుధాకర్‌లను ఈ సందర్భంగా అభినందించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఆచార్య వెంకటేశ్వర్లకు మాజీ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు, ఆచార్య రామచంద్రన్‌కు మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్‌లు బాధ్యతలు అప్పగించారు. డైరెక్టర్, కోఆర్డినేటర్లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవి అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, తాత్కాలిక వీసీ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు, ఇన్‌చార్జ్ రెక్టర్ ప్రొఫెసర్ కె.రత్న షీలా మణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలంలకు ధన్యవాదాలు తెలిపారు. దూరవిద్యా కేంద్రం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు.

మారుమూల గ్రామాలకు మంచినీటి సరఫరా

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం, కోయవారిపాలెం, కొండేపాడు, గొట్టిపాడు, నిమ్మగడ్డవారిపాలెం పంచాయతీలలో బుధవారం 'హర్ ఘర్ జల్', 'ఓడీఎఫ్ ప్లస్' కార్యక్రమాలు గురించి గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని గ్రామ సభలను సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. హర్ ఘర్ జల్ కార్యక్రమమునకు సంబంధించి గ్రామంలోని ప్రతి కుటుంబానికి రక్షిత మంచి నీటిని కుళాయి ద్వారా అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. గ్రామంలో మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడం తద్వారా కాలువలను పరిశుభ్రంగా ఉంచటం చేయాలి, తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించడం, సేకరించిన చెత్తతో వర్మి కంపోస్ట్ తయారు చేయడం తద్వారా పరిశుభ్రతకు మారుపేరుగా గ్రామాన్ని తీర్చిదిద్దడం ఓడీఎఫ్ ప్లస్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రావు, జల జీవన్ మిషన్ కో ఆర్డినేటర్ తేజ్, వాటర్ ఎయిడ్ సంస్థ కో ఆర్డినేటర్ సురేష్, ఐటీసీ, ఫినిష్ సొసైటీ కో ఆర్డినేటర్ ఉమాదేవి తదితరులు తెలిపారు.

టీజేపీఎస్ కళాశాలకు నాక్ బి++ గ్రేడ్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక టి.జె.పి.యస్. కళాశాలను ఈ నెల నాక్ టీం విజిట్ చేసి వెళ్ళిందని, బుధవారం కళాశాల కు నాక్ బి++ గ్రేడ్‌కు ఎంపిక చేసారని కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ తెలియచేశారు. ఈ సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ సామాజిక సేవా భావంతో ఏర్పాటు చేసిన కళాశాల టి.జె.పి.యస్. కళాశాల అని, ఇందులో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఇప్పుడు ఉన్నత స్థితిలో వున్నారని, ఎవరైనా ప్రతిభ ఉండి, పేద విద్యార్థులు ఉంటే వారికి ఆర్థికసహాయం చేస్తామని చెప్పారు. కళాశాలను నాక్ తీసుకెళ్లడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు చెప్పారు. కళాశాల పేరు ప్రఖ్యాతలలో కీలక పాత్ర పోషించిన అందరికీ కళాశాల అధ్యక్షులు శ్యాం సుందర్, యాజమాన్య సభ్యులు అభినందిచారు. కార్యక్రమంలో ట్రెజర్ వి.కృష్ణానంద్, ప్రిన్సిపాల్ ఏ.బి.పి.మనోహర్, డాక్టర్.యస్.అనిత దేవి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కె.శాస్త్రి ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, మంగళగిరి, డోరు నెం.8-131, కాపురస్తులు లేటు బిట్రా వీరనారాయణ గారి భార్య బిట్రా రామకుమారి అను నేను నా పేరిటకు మంగళగిరి రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ కాబడిన విక్రయ దస్తావేజు నెం.2391/2002 మరియు 2392/2002లను ది.4-7-2024న విజయవాడ నుండి మంగళగిరికి టూ వీలర్‌పై వెళ్ళుతుండగా పోయినవి. ఎవరికైనా దొరికినయెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఘనంగా వెంకట రమణయ్య జయంతి

విశాలాంధ్ర-పెదనందిపాడు : గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా బుధవారం పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో వెంకట రమణయ్య చిత్రపటానికి ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గేరా మోహన రావు, గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిని పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ నిర్వాహకురాలు పి.సుభాషిని అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు మాట్లాడుతూ అయ్యంకి వెంకట రమణయ్య ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులని అన్నారు. పత్రికా సంపాదకుడిగా పనిచేస్తూ గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను నిర్వహించారని, గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం వరకు చురుకుగా పాల్గొని గ్రంథాలయ పితామహుడుగా పేరుపొందారని తెలిపారు. కార్యక్రమంలో బొనిగల రత్నకుమార్, గేరా రామస్వామి, కట్టా ముత్తయ్య, పాల్గొన్నారు.

వంద పడకల సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-మంగళగిరి : వంద పడకల సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ బుధవారం సాయంత్రం మంగళగిరి పట్టణంలోని డాక్టర్ వంశీకృష్ణ ఆసు పత్రి ఆవరణలో జయరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా నిర్మిస్తామని మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గత పది సంవత్సరాలుగా 100 పడకల సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ మంగళగిరి, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యం లో అనేక పోరాటాలు చేయడం జరిగిందని సమావేశం తెలియ జేసింది. అనంతరం వంద పడకల సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రి సాధన కమిటీ మంగళగిరి చైర్మన్‌గా డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్, కన్వీనర్‌గా డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, కో కన్వీనర్స్‌గా నన్నపనేని నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, కోశాధికారిగా వీవీ ప్రసాద్, సభ్యులుగా చిన్ని తిరుపతయ్య, న్యాయవాది ఎం.గోవర్ధన్ రావు, ఎస్ఎస్ చంగయ్య, దామర్ల రాజు, దామర్ల నాగమణి, డాక్టర్ పి.గిరిజ, ఎస్.బాలకృష్ణ, కె.సుందరయ్య, వల్లభనేని వాణిలను ఎన్నుకున్నారు. కాగా కమిటీ సభ్యులంతా భవిష్యత్తులో హాస్పటల్ అభివృద్ధికి ఏ సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు ఎం.రవి, జేవీ రాఘవులు, పి.బాలకృష్ణ, ఎం.బాలాజీ, ఎస్.గణేష్, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

సమాజం కోసం పోరాడినప్పడే జాషువాకు నిజమైన నివాళి

విశాలాంధ్ర-తెనాలి : అలనాడు సమాజంలోని సామాజిక అసమానతలు కులవివక్ష వంటి రుగ్మతలను గుర్రం జాషువా తన కవితతో చికిత్స అందించారని జాషువా కవితపై అధ్యయనం చేసిన న్యూటన్ అన్నారు. తెనాలి కొత్తపేట పెన్షనర్ అసోసియేషన్ హాలులో బుధవారం పెన్షనర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో జాషువా 53వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. సభకు సంస్థ అధ్యక్షులు రామకృష్ణ అధ్యక్షత వహించారు. గుర్రం జాషువా ఆయన రాసిన ఫిరదౌసి, ముంతాజ్‌మహల్ కావ్యాలలో భావ కవిత్వ రీతి నుండి పక్కకు జరిగి, సామా జిక ప్రయోజనం ఆశించి రచనలు చేశారన్నారు. అసోసి యేషన్ సెక్రటరీ సూర్యప్రకాష్ మాట్లాడుతూ మనిషి ఔన్నత్యం వైపుకు నడిపించి, సమాజంలోని అసమానతలు తొలగించి, సమాజం సౌభాగ్యవంతం గాను, సుఖశాంతుల తోనూ శ్రామిక, పీడిత జనోద్ధరణ కోసం కవిత్వం రూపంలో తపించారన్నారు. సభా ప్రారం భంలో జాషువా చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. గౌరవ అధ్యక్షులు సాగర్, కోశాధికారి హృదయరాజు, పాల్గొన్నారు.

IN THE COURT OF THE V ADDL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA

O.S. No. 181/2020

Between:
M/s. Lakshmi Finance Pvt Ltd Reptd by K. Yesu Ratnam - Plaintiff
and
Pallapu Gopi and 2 Others - **Defendants**
To,
ప్రతివాది నెం.1 : Pallapu Gopi, S/o. Nageswara Rao, Hindu, Aged about 25 yrs, D.No. 103, Vankayalapadu Village, Edlapadu Mandal, Guntur District-522233
ప్రతివాది నెం.2 : Pallapu Gopi Krishna, S/o. Chinna Ankama Rao, Hindu, Aged about 23 yrs, R/o.D.No. 5-184, Vankayalapadu Village, Edlapadu Mandal, Guntur District-522233
పై నెంబరు దావా ప్రొసీడింగ్స్‌లో ఒకటవ మరియు రెండవ ప్రతివాదికి వాది పంపిన నోటీసులు అందకపోవుట వలన పై తెలిపిన కోర్టు నందు ది.21-8-2024వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు ప్రత్యక్షంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు కానిచో సదరు దావా ప్రొసీడింగ్స్ మీ పరోక్షమందు తీర్మానించగలరని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
వాయిదా తేదీ : 21-08-2024
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

I. Venkateswara Rao, B.Com., B.L.,
I. Vikram Kumar, B.A., L.L.B.,
Advocates,
#29-27-66, Suryanarayana Street,
Suryaraopet, Vijayawada-520002.
Cell : 98481 50315, 9502368338

KITS AKSHAR INSTITUTE OF TECHNOLOGY
(Formerly Guntur Engineering College)
Approved by AICTE
Affiliated to JNTUK
EAPCET Code: KITG
NH-16, Opp. Katuri Medical College, Yanamadala, Guntur - 522 019
M: 99517 13366, 99089 78444, 98669 53399, 90300 89039

Admission for NRI Seats (B-Category)

Applications are invited from the eligible students for 15% of **Category-B NRI Seats** for admissions to UG Courses for the Academic Year 2024-25.

B.Tech	CSE	CSE (AIML)	CSE (DS)	ECE	IT
15% of NRI Seats	54	9	9	9	9

Applications forms can be collected from the College Office on all working days or can apply through College website **www.kitsakshar.ac.in**. The last date for submission of filled in application forms along with copies of relevant certificates at the College Office is on or before **27-07-2024 (Saturday)** before **5.00pm**. Selection of candidates will be as per APSCHE Guidelines. **Sd/- PRINCIPAL**

KITS AUTONOMOUS KKR & KSR Institute of Technology and Sciences
Approved by AICTE | Permanently Affiliated to JNTUK
Accredited with "A" Grade by NAAC | Accredited by NBA
Vinjanampadu (V), Vatticherukuru (M), Guntur - 17.
Ph: 99517 13366, 99089 78444, 94419 15837, 94907 75885

Admission for NRI Seats (B-Category)

Applications are invited from eligible candidates for 15% of **Category-B NRI Seats** for admissions to UG Courses for the Academic Year 2024-25.

B.Tech.	CSE	CSE (DS)	CSE (AIML)	ECE	EEE	IT
15% of NRI Seats	72	27	27	27	9	18

Application forms can be collected from the College Office on all working days or can apply through College website **www.kitsguntur.ac.in.** The last date for submission of filled in Application Form along with copies of relevant certificates at the College Office is on or before **27.07.2024 (Saturday)** before **5.00pm**. Selection of candidates will be as per APSCHE Guidelines. **Sd/- PRINCIPAL**

సంతానలేమి సమస్యలకు పరిష్కారం 'ఐవీఎఫ్'

- సమస్య ఉన్న ప్రతీ ఒక్కరికీ ఐవీఎఫ్ అవసరం లేదు
- అందుబాటులో ఆధునిక చికిత్సలు

(నేడు 'వరల్డ్ ఐవీఎఫ్' డే సందర్భంగా ప్రత్యేక కథనం)

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈ సృష్టిలో ప్రతి జీవి అద్భుతం. ప్రతి పుట్టుక అద్వితీయం. అయితే సృష్టికి ప్రతి సృష్టిలా మానవుడి మేధాశక్తి ఎన్నో అద్భుతాలను సృష్టించింది. పూర్వం సంతానం లేని వారు తమకు జీవితంలో తల్లిదండ్రులు అయ్యే యోగం లేదని సరిపెట్టుకునేవారు. కానీ ఇప్పుడు వైద్యశాస్త్రం మరింత అభివృద్ధి చెందింది. దీంతో కృత్రిమంగా గర్భధారణ చేసే వైద్య విధానాలు నేడు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. సంతానం లేని వారికి సంతానం కలిగేలా ఇప్పుడు అనేక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి.

● **ఐవీఎఫ్ ఆవిర్భావం :** 1978న జులై 25వ తేదీన ఇంగ్లాండులో లూయిస్ బ్రౌన్ కృత్రిమ గర్భధారణ (ఐవిఎఫ్, ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్)పద్ధతిలో జన్మించిన మొట్టమొదటి మహిళ. లూయిస్ బ్రౌన్‌కు ఇప్పుడు 44 సంవత్సరాలు. ఆమె పెళ్లి చేసుకొని ఇద్దరు పిల్లలతో హాయిగా జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రక్రియ సంతానోత్పత్తి చికిత్స రంగంలో అతిపెద్ద విజయం. ఈ విజయానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 25న 'ప్రపంచ ఎంబ్రియాలజిస్ట్ డే' గా జరుపుకుంటున్నారు. ఇది కాలక్రమంగా నేడు ఐవీఎఫ్ డేగా ప్రాచుర్యం పొందింది.

● **ఐవిఎఫ్ అంటే ఏమిటి :** ఐవీఎఫ్ అంటే ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్. ఐవీఎఫ్ అనేది శరీరం వెలుపల ఫలదీకరణ



కోసం చేసే ఒక ప్రక్రియ. ఎగ్స్, స్పెర్మ్‌ను కలిపి చేసే ఒక రకమైన ఫలదీకరణం. ఈ ప్రక్రియ (గాజులో) టెస్ట్ ట్యూబ్‌లో జరుగుతుంది కాబట్టి దీనిని టెస్ట్ ట్యూబ్ బేబీ అని అంటారు. ఈ ప్రక్రియలో అండాశయాల నుంచి అండాన్ని తొలగించడం జరుగుతుంది. భర్త స్పెర్మ్ తీసుకొని దానిని భార్య అండాశయంలో ఫలదీకరణను ల్యాబ్‌లో చేయడం జరుగుతుంది. ఎవరిలోనైతే సహజంగా గర్భం దాల్చడం సాధ్యపడదో అటువంటి వారు ఐవీఎఫ్ ప్రక్రియకు వెళితే గర్భం దాల్చే సక్సెస్ రేటు ఎక్కువగా ఉంటుంది. ఒక్కొక్కసారి ఎగ్ క్వాలిటీ సరిగా లేకపోవడం వల్ల అంటే హెల్దీ ఎంబ్రియో ఫార్మేషన్ జరగకపోవడం వల్ల ఐవీఎఫ్ ఒక్కొక్కసారి ఫెయిల్ అవుతుంది. ఎప్పుడైతే ఇంప్లాంటేషన్ అంటే గర్భసంచిలో గర్భం సరిగా ఇంప్లాంటేషన్ జరగకపోవడం వల్ల కూడా ఐవీఎఫ్ సక్సెస్ రేట్ తక్కువ అయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయి. మెటర్నల్ (అంటే ఎక్కువ వయసు ఉన్నవారు) వయస్సు వారిలో సక్సెస్ రేటు తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. 32 సంవత్సరాల వయసు కన్నా తక్కువ ఉన్న వారిలో ఐవీఎఫ్ సక్సెస్ రేటు ఎక్కువగా ఉంటుంది. అదేవిధంగా హార్మోన్స్, ఎండో ఫాలికల్ కౌంట్ మంచిగా ఉండటం వల్ల సక్సెస్ రేటు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉంటాయి.

● **ఎటువంటి వారికి ఐవీఎఫ్ అవసరం :**
ఎవరిలో అయితే ట్యూబులు క్లోజ్ అయి ఉంటాయో..అలాగే ఎండోమెట్రియోసిస్ ఉన్న వాళ్లు..అండాశయాలు సరిగా లేని వాళ్లు.. పాలిసిస్టిక్ సిండ్రోమ్ సమస్య ఉన్నవాళ్లు..ఏజ్ రిలేటెడ్ ఇన్‌ఫెర్టిలిటీ ఉన్న వాళ్లను ఐవీఎఫ్‌కు సజెస్ట్ చేస్తారు. అదేవిధంగా పురుషునిలో ఇన్‌ఫెర్టిలిటీ ఉన్న కణాలు చాలా తక్కువగా ఉన్న వారిని..అసలు లేని వారిని కూడా ఐవీఎఫ్‌కు సజెస్ట్ చేయడం జరుగుతుంది.

● **ఎన్నిసార్లు ఐవిఎఫ్‌కు వెళ్ళవచ్చు :**
అమెరికన్ సొసైటీ ఆఫ్ రి-ప్రొడక్టివ్ మెడిసిన్ (ఏఎస్ఆర్ఎమ్)ప్రకారం 35 సంవత్సరాల వయసు గలవారు ఆరు సైకిల్స్ వరకు ఐవీఎఫ్‌కు వెళ్ళవచ్చు. అదేవిధంగా 35 నుంచి 37 సంవత్సరాల వారు ఐదు సైకిల్స్ వరకు..అలాగే 38 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్నవారు 4 సైకిల్స్ వరకు.. అదేవిధంగా 40 సంవత్సరాల పైబడిన వారు రెండు లేదా మూడు సైకిల్స్ వరకు ఐవీఎఫ్‌కు వెళ్లవచ్చు. అయినప్పటికీ ఐవీఎఫ్ సక్సెస్ కాకపోతే డోనార్ ఎగ్స్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

● **ఐవీఎఫ్ ట్రీట్‌మెంట్ తర్వాత ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి :**
సంతానలేమి సమస్య ఉన్న భార్యాభర్తలు ఐవీఎఫ్ చికిత్స తీసుకున్న తరువాత హెల్దీలైఫ్ స్టైల్..హెల్దీ డైట్ మెయింటినెన్స్ చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి. ప్రెగ్నెన్సీ సమయంలో డాక్టర్లు ఏ ఎక్సర్ సైజులు సిఫార్సు చేస్తారో ఆ ఎక్సర్‌సైజులను క్రమం తప్పకుండా చేయాల్సి ఉంటుంది. అలాగే విటమిన్ సప్లిమెంట్స్ తీసుకుంటూ ఉండాలి. రెగ్యులర్ చెకప్‌కి వెళ్ళాలి. ఇటువంటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రెగ్నెన్సీ విజయవంతం అవుతుంది.

● **ఐవీఎఫ్‌లో నేడు ఆధునిక వైద్య చికిత్సలు :**
సంతానలేమి సమస్యతో బాధపడుతున్న వారికి నేడు ఐవీఎఫ్‌లో ఆధునిక పద్ధతులు వచ్చాయి. ఇంట్రా సైటో ప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ఇక్సీ), ట్యూబల్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ (టెట్), జైకోటిక్ ఇన్‌ట్రా ఫెలోపియన్ ట్రాన్స్‌ఫర్ (జిఫ్ట్), ఐవీఎఫ్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్, ఇన్‌ట్రా ఫెలోపియన్ ట్రాన్స్‌ఫర్ వంటి ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి.

ప్రజాధరణ పొందిన ఐవీఎఫ్ :

డాక్టర్ షమ సుల్తాన, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ కన్సల్టెంట్, హోప్‌విన్ హాస్పిటల్, గుంటూరు.

భారతదేశంలో ఐవీఎఫ్ ప్రజాధరణ పొందింది. దీనికి విస్తృతమైన ప్రచారం ఉండటం వల్ల దేశ వ్యాప్తంగా దాదాపు అన్ని నగరాల్లో ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో ఇటీవల కాలంలో పిల్లలు కలగని దంపతులు ఈ దిశగా ఆలోచన చేస్తున్నారు. సంతోనా తోత్పత్తి సమస్యల కారణంగా ఎక్కువ మంది భార్యాభర్తలు ఐవీఎఫ్‌కు వెళుతున్నారు. పిల్లలు కలగని దంపతులు ఐవీఎఫ్‌కు వెళ్ళాలనుకునే వారు తొలుత ఐవీఎఫ్ పట్ల వారిలో ఉన్న అపోహలను తొలగించుకోవాలి. ఐవీఎఫ్ సెంటర్‌లో ఉన్న కౌన్సిలింగ్‌కు వెళ్ళాలి. ఆ తరువాత ఐవీఎఫ్ పట్ల అవగాహన పెంచుకుని ఎలాంటి భయం లేకుండా ఐవీఎఫ్ చికిత్స పొంది పండంటి బిడ్డకు జన్మనివ్వాలి.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

సమస్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే చదలవాడ వినతి



విశాలాంధ్ర-నరసరావుపేట: పంచాయతీ రాజ్,గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌ను మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు. ముఖ్యంగా కోటప్పకొండ ఘాట్ రోడ్డు, కోటప్పకొండ చుట్టు రోడ్లు అనుసంధానం చేసేందుకు దాదాపు రూ.30 కోట్లు పైగా అవసరమవుతుందని వివరించారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్యం, సాగునీటి కాలవల్లో పూడిక తొలగింపు లాంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కోటప్పకొండ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు శాఖమూరి రామూర్తి ఉన్నారు.

మద్యం విక్రయాలపై విచారణ చేయాలి : ఎమ్మెల్యే జీవి

విశాలాంధ్ర-వినుకొండ : మద్యంపై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల సందర్భంగా వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అసెంబ్లీలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం సేవించి వేలాదిమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని జీవి అన్నారు. మద్యం కుంభ కోణంపై లోతుగా విచారణ జరపాలని ఆయన అన్నారు. నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించారు. ప్రభుత్వ ఖజానాను లూటీ చేసారు. ఏ కంపెనీలకు జగన్ ప్రభుత్వం దోచి పెట్టిందో, ఆ దోపిడీ సొమ్మును సదరు కంపెనీల నుంచి రికవరీ చేయాలి అని జీవి తెలిపారు. రికవరీ చేసిన సొమ్మును ప్రజా ప్రయోజనాలకు ఖర్చు పెట్టాలని, వేల కోట్లలో జరిగిన అనధికారిక మద్యం విక్రయాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

ఎన్టీఆర్ యూనివర్శిటీ పేరు పునరుద్ధరణపై హర్షం : ఎమ్మెల్యే చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట: అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పేరు పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మద్దతు తెలిపారు. ప్రపంచ స్థాయిలో రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింపజేసిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. అదే సమయంలో రాష్ట్రంలో తొలి మెడికల్ యూనివర్శిటీ ఏర్పాటు చేసి వైద్య విద్యకు తోడ్పాటుగా నిలిచారు. అలాంటి పేరును జగన్ రెడ్డి తొలగించడం అత్యంత దుర్మార్గం అన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పేరును పునరుద్ధరించేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్య విద్యార్థులు సంతోషంగా ఉన్నారు. కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం యూనివర్శిటీకి చెందిన రూ.300 కోట్ల డిపాజిట్ బిల్లుల్ని కూడా స్వాహా చేశారన్నారు. నాటి రిజిస్ట్రార్ తిరగబడినా వినకుండా డబ్బులు మళ్లించర న్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.400 కోట్లను దారి మళ్లించారన్నారు. ఎంప్లాయీస్ పీఎఫ్ ఫండ్ రూ.800 కోట్లు దారి మళ్లించడం అత్యంత దుర్మార్గం అన్నారు. ఆ సొమ్ము మొత్తాన్ని రికవరీ చేసి యూనివర్శిటీకి అప్పగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు నిర్ణయం పై ఎమ్మెల్యే అరవింద బాబు హర్షం వ్యక్తం చేశారు.

పాడి రైతుల సంక్షేమం కోసం సంగం డెయిరీ కృషి



విశాలాంధ్ర-శావల్యాపురం: పాడిరైతుల సంక్షేమమే లక్ష్యంగా సంగండెయిరీ నిరంతరం కృషి చేస్తుందని వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ కొత్తపల్లి నాగప్రభు అన్నారు. మండలంలోని వయ్యకల్లు గ్రామం లోని సంగం డెయిరీ వెండార్ సెంటర్లో బోనసుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సెంటర్లోని 24 మంది పాలఉత్పత్తిదారులకు మొత్తం రూ.1,25,606 లు బోనస్ పంపిణీ చేశారు. వారిలో అత్యధికంగా దారా డేవిడ్ రూ.23,073, మర్రి కోటేశ్వరరావు రూ.13,239, దారా అంజయ్య రూ.12,546 లను బోనస్‌గా పొందారు. సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు మాట్లా డుతూ పాల ఉత్పత్తి దారులకు రాయితీలు, బోనస్లలను అందించడమే కాక సంగండెయిరీ ద్వారా లబ్దిదారులకు డివిఆర్ హస్పిటల్ ద్వారా రాయితీపై వైద్య సేవలు, పశు వైద్య సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. వయ్యకల్లులో రూ.100కి రూ.3 చొప్పున బోనస్ గా పంపిణీ చేశామన్నారు. సెంటర్ అధ్యక్షులు గోరింట్ల పెదయోగయ్య, సూపర్వైజర్ రామాంజనేయులు, కోఆర్డినేటర్ రామకోటయ్య, గ్రామస్తులు నడింపల్లి లక్ష్మయ్య, గోరింట్ల వీరవెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో సంసిద్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-శావల్యాపురం : గుంటూరు పట్టణంలోని నెక్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఈ నెల 20వ తేదీ నుంచి జరిగిన రోప్ స్కిప్పింగ్ జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీల్లో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఒంటేరు నాగసురేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల్లో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన హంసహర్షిత, లక్ష్మీశృంగేరీలు బంగారు పతకాలు సాధించగా, హర్షత్ రజత పతకాన్ని సాధించాడని, అండర్-12, 10 విభాగాలలో భారతి, భానుప్రకాష్, షారుక్, యశ్వంత్, హర్షితలు రజత, కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. ఆగస్టు 10, 11 తేదీలలో కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల తరపున 8 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో కూడా విద్యార్థులు బాగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

బాల్య వివాహాలు - అభివృద్ధి నిరోధకాలు

విశాలాంధ్ర-రెంటచింతల: చిన్న వయసులోనే బాలికలకు వివాహాలు చేయడం వల్ల వ్యక్తిగతంగా వారితోపాటు సమాజాభివృద్ధికి నిరోధకాలుగా మారుతున్నాయని, బాలల హక్కులను కాలరాచే బాల్య వివాహాలను ప్రోత్సహించడం శిక్షార్హమని ఐసీడీఎస్ రెంటచింతల మండల సూపర్వైజర్ నాగమణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాల్వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన మిషన్ శక్తి-భారతీయ న్యాయ సంహిత అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. వైద్యులు ప్రదీప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ప్రజల్లో మార్పు వస్తేనే బాల్య వివాహాలు నిర్మూలించవచ్చన్నారు. బాలికలను చదివించిన ప్పుడే వారు చైతన్యవంతులవుతారని బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య ప్రణాళిక అమలు చేయండి

- మండల స్థాయి, గ్రామ స్థాయి పారిశుద్ధ్య కమిటీలు ఏర్పాటు చేయండి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం మండల/మున్సిపల్ స్థాయి, గ్రామ స్థాయిల్లో పారిశుద్ధ్య కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీ నేతృత్వంలోని కమిటీ గ్రామ స్థాయిలో పారిశుద్ధ్య ప్రణాళిక అమలు చేయాల్సి ఉంటుందన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని డా.బీఆర్ అంబేద్కర్ సమావేశ మందిరంలో పారిశుద్ధ్యం, ఆరోగ్యం, తాగునీటి సరఫరా, ఆధార్ కేంద్రాలపై కలెక్టర్ పి.అరుణ్ బాబు బుదవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ కోసం జిల్లా స్థాయి, మున్సిపల్ స్థాయి కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. వైద్యాధికారులను ఎప్పటికప్పుడు సంప్రదించి వారి పరిధిలో ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. ఫ్రైడే-డ్రై డే వారంలో శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజుల పాటూ నిర్వహించాలన్నారు. స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి గ్రామాలు, పట్టణాలలో స్వచ్ఛత పెంపొందించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 71 ఆధార్ కేంద్రాల్లో వీలైనంత ఎక్కువ మందికి ఎన్రోల్ మెంట్ సర్వీసులు అందించాల న్నారు. వచ్చే నెల పింఛన్ల పంపిణీ తొలి రోజే వంద శాతం పంపిణీ చేసేందుకు ముందు రోజే బ్యాంకుల నుంచి నగదు విత్ డ్రా చేసుకోవడం, ఒక్కో ఉద్యోగికి 50-60 మంది పింఛన్ దారులను మాత్రమే మ్యాపింగ్ చేయడం, దూర ప్రాంతాల్లో ఉన్న లబ్దిదారులను ముందురోజు నాటికే సొంత ఊర్లకు వచ్చేలా చూడటం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వసంత రాయుడు, డీపీవో ఎం.వి.భాస్కర్ రెడ్డి, డీఎంహెచ్వో రవి, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి వెంకట్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ బాలు నాయక్, డీఎల్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

గుర్రం జాషువాను ఆదర్శంగా తీసుకోవాలి

- సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక సీపీఐ ఆఫీస్, శివయ్య భవనంలో కవి కోకిల, విశ్వ నరుడు, గుర్రం జాషువా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లా డుతూ కవి కోకిల, విశ్వ నరుడు కీర్తిశేషులు గుర్రం జాషువా మన ప్రాంతంలో పుట్టటం మన ప్రాంతానికి జాషువా ద్వారా ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావడం మనం చేసుకున్న అదృష్టమని కొనియాడారు. జాషువా తన కవితలతో తన పద్యాలతో అణగారిన వర్గాల వేధించబడ్డటువంటి వర్గాలను చైతన్యపరచటం కోసం కవితలు ఎంతగానో ఉపయోగపడ్డాయని అయన అన్నారు. జాషువా తన జీవిత కాలంలో ఎన్నో బిరుదులు, పురస్కా రాలు అందుకున్నారని, తిరుపతి వెంకట కవులు ఒకరైన చల్ల పిల్ల వెంకటశాస్త్రి జాషువా కాలికి గండ పెండేరం కాలికి తొడిగి కవీశ్వరుని పాదం తాకి నా జన్మధన్యం చేసుకున్నా రని అన్నారని అటువంటి గొప్ప వ్యక్తి విశ్వ నరుడు జాషువా ని వారిని నేటితరం యువత ఆదర్శంగా తీసుకొని సమాజ స్థాపన కోసం కృషి చేయాలని బూదాల శ్రీనివాసరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఉలవలపూడి రాము, పిన్నబోయిన వెంకటేశ్వర్లు, పొట్లూరి వెంకటేశ్వర్లు, కొప్పరపు మల్లికార్జున, దర్యావలి, చింతపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

జాషువా ఆశయాలకు అనుగుణంగా ప్రతి కళాకారుడు సమాజానికి దోహదపడాలి

– బైరాపట్నం రామకృష్ణ



విశాలాంధ్ర-అమరావతి: సామాజిక స్పృహతో గబ్బిలం లాంటి మహోన్నత కావ్య రచయిత, గాన కోకిల బిరుదాంకితుడు జాషువా వారు మహోజ్వాల కవిత నాటక సృజనాత్మకమైన ఎన్నో అపురూప కావ్యాలు అందించిన మహెూన్నత వ్యక్తి గుర్రం జాషువా ఆశయాలకు అనుగుణంగా ప్రతి కళాకారుడు కవి రచయిత సమాజానికి ఎంతగానో దోహదపడాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన అమరావతి లోనే ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గుర్రం జాషువా 53వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రాజరిక వ్యవస్థలోనే చరిత్ర కలిగిన సత్య హరిశ్చంద్ర నాటకంలో నేటికీ ప్రసిద్ధి చెందిన కాటిసీను ఘట్టంలో గుర్రం జాషువా రచించిన పద్యాలు వజ్ర ఖడ్గం లాంటివని అన్నారు. అనేక నాటకాలు, కవితలతో గండబేండానికి నిలువుటద్దంలా చరిత్రకెక్కిన గుర్రం జాషువాని మరువలేమని అన్నారు. వర్ధంతి సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో కళాకారులు జి రాజు, చిక్కాల ఉదయ శేఖర్, జి పానయ్య, సాయి శేఖర్, బాబు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీలు

- 15 రోజుల క్రితం రూ. 7.30 లక్షల పురుగుమందులు సీజ్
- సుమారు 4 లక్షల విలువైన విత్తనాలు అమ్మకాలు నిలుపుదల
- తనిఖీల్లో వ్యవసాయ డిప్యూటీ డెరెక్టర్లు, ఏడీఏలు, ఏఓలు

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలోని పలు విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బిల్లులు లేకుండా, స్టాక్ రిజిస్టర్స్‌లో తేడాలు ఉండటంతో సుమారు 4 లక్షల రూపాయల విలువైన విత్తనాలు అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డైరెక్టర్లు శ్రీనివాస రావు, రమణమూర్తి, ఏడీఏలు రవిబాబు, రవికుమార్, ఏఓ అంజిరెడ్డి తదిత రులు పాల్గొన్నారు. గత పదిహేను రోజుల క్రితం, జూలై 6 తనిఖీలు నిర్వహించిన సమయంలో కిసాన్ ఆగ్రో టేక్నాలజీలో అనధికారికంగా ఉన్న 7లక్షల 30 వేల రూపాయల పురుగు మందులను సీజ్ చేసి వారి లైసెన్సులను సస్పెన్షన్ చేశారు. షాపుల్లో 3 లక్షల 80 వేల రూపాయల విలువైన విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు.

నేటి సమాజానికి జాషువ రచనలు మార్గదర్శకం

విశాలాంధ్ర, తెనాలి : నేటి సమాజానికి జాషువ రచనలు మార్గదర్శకమని పలువురు వక్తలు అన్నారు. గుర్రం జాషువ 53వ వర్ధంతిని పురస్కరించుకుని గుర్రం జాషువ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో స్థానిక బస్టాండ్ వద్ద కల జాషువ విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఉపాధ్యాయునిగా జీవితం ప్రారంభించిన జాషువ సాహితీవేత్తగా ఎదిగి 59 ఖండకావ్యాలు, 14 నాటకాలు రాసారని, అలనాటి సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు తన రచనల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చిన విశ్వనరుడు జాషువ అని వక్తలు కొనియాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పొన్నెకంటి రత్నాకర్ ఇటీవల బాపూ జగజ్జీవనరామ్ ఛైర్‌కు సంచాలకులుగా నియమితులైన నేపథ్యంలో ఈ కార్యక్రమంలో ఆయనను గుర్రం జాషువ విజ్ఞాన సమితి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమలో జె. న్యూటన్, పి. రవికుమార్, కొండమూది రమేష్, వి.రత్నం, పి. రాజగోపాల్, గరికిపాటి సుబ్బారావు, షేక్ అబ్దుల్ హకీం జాని, యంద్రపాటి అశోక్‌కుమార్, కె. సింగయ్య, వి. రాజారత్నం, ఏ.మల్లేశ్వరరావు, కె. దేవయ్య, శరత్ వెంకయ్య, సుద్దపల్లి మురళీధర్, కె. లక్ష్మణరావు, ఎల్. ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని స్థానిక బాప్టిస్ట్ పేట నుంచి భార్గవ్ పేటకు వెళ్లే మార్గంలో గత కొన్ని సంవత్సరాలుగా పూడికతీత పనులు నిర్వహించకపోవడంతో మురుగు నీరు కాలువల నుంచి బయటకు వచ్చి రోడ్లపైన నిలబడే దుస్థితి ఉంది. ఈ సమస్యను స్థానికులు నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళగా మంత్రి ఆదేశాలతో ఎంటీఎంసీ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. సమస్యను తెలిపిన వెంటనే స్పందించి ఆదేశాలు జారీ చేసిన నారా లోకేష్‌కు బాప్టిస్ట్ పేట వాసులు ధన్యవాదములు తెలిపారు.

ర్యాగింగ్‌పై విచారణ చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థగా పేరొందిన నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల హాస్టల్లో జూనియర్ విద్యార్థులపై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో పాశవికంగా దాడి చేసిన వీడియోపై పోలీస్ శాఖ, విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఎన్ కళాశాల హాస్టల్లో విద్యార్థులు రూమ్‌లో జూనియర్ విద్యార్థులపై కర్రలతో విచక్షణ రైతంగా మూకుమ్మడిగా కొడుతున్నట్లు వీడియో రిలీజ్ అయింది. ఈ వీడియోపై స్పందించిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్‌తో పాటు ఏఐ ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు కళాశాల హాస్టల్లో సందర్శించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కళాశాల హాస్టల్ వార్డెన్ సీపీఐ నాయకులను అడుక్కోవడంతో విద్యార్థులకు న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో వన్ టౌన్ పోలీసులు హాస్టల్లో సందర్శించి విచారణ చేపట్టారు. ఈ వీడియో ఫిబ్రవరి నెలలో చిత్రీకరించిందని, ఇప్పుడు అలాంటి సంఘటన జరగలేదని కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు అంటున్నారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేయకపోతే కాలేజీకి ముట్టడిస్తామని సీపీఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు హెచ్చరించారు.

సాంబిరెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నేత, క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం సాయంత్రం గుంటూరు నుంచి తాళ్లూరు వస్తుండగా అమరావతి మండల పరిధిలోని ఉంగుటూరు, కంభంపాడు శివార్లు కారును అడ్డగించి ఇనుప రాడ్లతో దాడి చేశారు. స్థానిక ప్రజలు రావటంతో దుండగులు పరారైనట్లు అమరావతి సీఐ ఏవీ బ్రహ్మం తెలిపారు. సాంబిరెడ్డిని గుంటూరు సాయి భాస్కర్ తరలించి చికిత్స చేస్తున్నట్లు వారు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు విషయం తెలిసిన వెంటనే హాస్పిటల్‌కి వెళ్లి సాంబిరెడ్డిని పరామర్శించి డాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 75 తాళ్లూరు సాంబిరెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా బుధవారం ధర్నాకు బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకర్రావును అమరావతి సీఐ బ్రహ్మం, పెదకూరపాడు ఎస్సై వెంకట్రావు, నరసరావుపేట సీఐ శోభన్ బాబు 14వ మైల్ గ్రామంలో అడ్డగించి వెళ్ళడానికి వీలులేదని, 144 సెక్షన్ అమలులో ఉందని చెప్పడంతో వెనుతిరిగి వెళ్ళిపోయారు. అనంతరం విలేకరులతో శంకర్రావు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో పెదకూరపాడు నియోజకవర్గంలో పార్టీలకు, కులాలకతీతంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పరిపాలన కొనసాగించామని, నేడు టీడీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి దాడులు చేస్తున్నారని అన్నారు. ఇది సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామానాయక్, సిబ్బంది ఉన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-దుర్గి : ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని కారంపూడి సర్కిల్ సీఐ ఎ.శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్ర మైన దుర్గి, ఆత్మకూరు గ్రామాల్లో బుధవారం ఆయన యాంటీ నక్సల్స్ స్క్వాడ్ పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సీఐ శ్రీనివాస్ దుర్గి బస్టాండ్ సెంటర్‌లో గ్రామస్థులతో మాట్లాడుతూ ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడవద్దని హితవుపలికారు. గ్రామంలో ఎవ్వరూ వ్యక్తిగత, రాజకీయ వేదింపులకు, ఘర్షణలకు పాల్పడవద్దని కోరారు. ఏ చిన్న ఘర్షణ విషయమైన తమ దృష్టికి వస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. ఆయన వెంట మాచర్ల రూరల్ ఎస్సై కుర్రి రాజశేఖర్ ఉన్నారు.

పచ్చి రాజకీయ అవకాశవాది వైఎస్ జగన్‌రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడవకముందే రాష్ట్రంలో ఏదో జరిగిపోతుందని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నారని ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి శ్రీలక్ష్మి ఆగ్రహం వ్యక్తంచేశారు. శవ రాజకీయాలకు పాల్పడుతున్న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా స్థానిక లాడ్జి సెంటర్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి శ్రీలక్ష్మి, జనసేన నాయకురాలు బి.ఉమా ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కోపూరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ పచ్చి రాజకీయ అవకాశవాది జగన్‌మోహన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో జరిగిన అరాచకం గురించి మాట్లాడ కుండా ఇప్పుడేదో జరిగిపోతుంది.. అంతా అయిపోయింద న్నట్టుగా మాట్లాడటం సిగ్గుగా ఉందన్నారు. రాక్షస రాజ్యం పోయి రామరాజ్యం వచ్చిందన్న సంతోషంలో ఈ రాష్ట్ర ప్రజలు ఉన్నారని, భవిష్యత్తులో జగన్మోహన్ రెడ్డిని ఈ రాష్ట్ర ప్రజల నమ్మే పరిస్థితులు లేరన్నారు. ఈ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని తిరగనీయకుండా ఏం చేయాలో చేసి చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి ఆనందకుమార్, బండి అమర్, గర్నెపూడి యోహాను తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి జయంతి, పాతూరి సంస్మరణ సభ

విశాలాంధ్ర-తెనాలి : గ్రంథాలయ పితామహులు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య, కళాప్రపూర్ణపాతూరి నాగభూషణ ంలు గ్రంథాలయ అభివృద్ధికి, గ్రంథాలయ ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారానికి జీవితాంతం నిరంతరం కృషి చేసిన మహోన్నతులని తెనాలి గ్రంథాలయ అధికారిణి రమాదేవి అన్నారు. తెనాలి నెహ్రూరోడ్డులోని గ్రేడ్ 1 శాఖా గ్రంథాల యంలో బుధవారం అయ్యంకి వెంకటరమణ జయంతి, పాతూరి నాగభూషణం వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అయ్యంకి, పాతూరిలు ప్రజల హృదయాలలో గ్రంథాలయాలు ఉన్నంతవరకు చిర స్థాయిగా నిలిచిపోతారన్నారు. గ్రంథాలయాలే కాకుండా వయోజన విద్యావ్యాప్తికి వారు చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఇవే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసిన మహోన్నతుడిగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ సహాయం ఆశించకుండా విశేషంగా గ్రంథాలయాను స్థాపించారని చెప్పారు. పాతూరి గ్రంథాలయోద్యమంతోపాటు స్వాతంత్ర్యోద్యమాన్ని కూడా పాల్గొన్నారన్నారు. విద్యార్థుల కొరకు గ్రంథాలయాల్లో వారికి సంబంధించిన పుస్తకాలను అందించి వారికి విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. గ్రంథాలయ శాస్త్రానికి సంబంధించి తెలుగులో పుస్తకాలు రచించారని చెప్పారు. పాతూరి శిష్యరికంలో ఎన్నో విషయాలు నేర్చుకొని, క్రమశిక్షణ, సమయ పాలన, వృత్తిలో నిబద్ధత, సేవా నిరతి వారి ద్వారానే అలవరచుకున్నానని, వారికి జీవితాంతం కృతజ్ఞురాలిగా ఉంటాన న్నారు. వారికి జోహార్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితోనే రాష్ట్రానికి ప్రత్యేక నిధులు

విశాలాంధ్ర-మాచర్ల: బడ్జెట్ కేటాయింపులో ఆంధ్రప్రదేశ్ కు ప్రాధాన్యత కల్పించి రాష్ట్రానికి ప్రత్యేక నిధులు మంజూరయ్యేలా సీఎం చంద్రబాబు కృషి ఎనలేని దని మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. బుధవారం యాగంటి మల్లికార్జునరావు విలేకరులతో మాట్లా డుతూ చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, ప్రగతికి దిక్సూచిగా ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి కోసమే చంద్రబాబు ఎన్డీఏ కూటమితో జతకట్టారన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామి కంగా అభివృద్ధి చెందేందుకు రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌలిక వసతులు నిధుల కేటాయింపు, అంశాలను పరిగణలోకి తీసుకొని ఇచ్చిన హామీ నెరవేరుస్తామంటూ కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించటం సంతోషకరమన్నారు. సీఎం చంద్రబాబు పాలనలో ఏపీ మరింత అవృద్ధి చెందనుందని ఆయన పేర్కొన్నారు.

మహిళల సాధికారత కోసమే 'మిషన్ శక్తి'

విశాలాంధ్ర-ఈపూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి పథకం మహిళల సాధికారత కోసమేనని ఈపూరు సీడీపీఓ బి.అరుణ అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి జూనియర్ కళాశాల జిల్లా పరిషత్ హైస్కూల్ శ్రీ విద్యానికేతన్ ప్రైవేట్ స్కూల్‌లో ఆరవ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ చదివే బాలికలకు మారిన కొత్త చట్టాలు, అక్రమ రవాణా, బాల్య వివాహ నిరోధక చట్టం, లైంగిక దాడులు, బాలల రక్షణ చట్టం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 14 సంవత్సరాల వయసు వరకు బాలికలు విద్యాలయాల్లోనే ఉండాలని, బడి బయటకాని, పనిచేసే ప్రదేశాల్లో కానీ ఉండరాదని అన్నారు. మారిన కొత్త చట్టాల గురించి వివరిస్తూ భారతీయ న్యాయ పరిధిలో మహిళలు, బాలికలకు సంబంధించిన సెక్షన్ 63, సెక్షన్ 64 అత్యాచారానికి విధించే శిక్షల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు సాంబానాయక్, ధనలక్ష్మి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ నరసింహారావు, చంద్రశేఖర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.చిన్నమ్మాయి పాల్గొన్నారు.

ఢిల్లీలో జగన్ దొంగ డ్రామాలు అట్టర్ ఫ్లాప్ : ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రజల దృష్టిని మళ్లించడానికి దేశ రాజధాని దిల్లీలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఆడిన డ్రామాలు, చేసిన దొంగ ధర్నా అట్టర్ ఫ్లాప్ అయ్యాయని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. ఇన్నాళ్ళు చేసిన చేసిన హత్యలు, దారుణాల రక్తపు మరకల్ని అంత త్వరగా తుడిచేసుకోవడం కూడా సాధ్యం కాదని ఈ పరిణామాలు అతడికి అర్థం అయ్యేలా చేశాయని, జగన్ రెడ్డి దిల్లీ ధర్నాను కనీసం పట్టించుకున్న వారు ఎవరు లేరని చురకలు వేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఏదో జరిగిపోతోందంటూ దిల్లీలో జగన్ బుధవారం చేసిన ధర్నాపై ఒక ప్రత్యేక పత్రికా ప్రకటనను విడుదల చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదు

విశాలాంధ్ర-దుర్గి: గ్రామాలలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయరాదని ఇన్చార్జీ ఎంపీడీఓ పి.శివప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని రాజా నగర్, ఓబులేశునిపల్లె, కోలగుట్ల, కంచరగుంట్ల గ్రామాల్లో బుధవారం ఒడిఎఫ్ ప్లస్, హర్ గర్ జల్ పథకాల పై అవగాహన గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో గ్రామస్తులు చెత్త వేయరాదని, మల, మూత్ర విసర్జనలు చేయవద్దని, మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో మరుగుదొడ్లు, మంచి నీటి కుళాయిలు సర్వే చేపట్టాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచిలు, కార్యదర్శులు, విఆర్వో రత్నప్రకాష్, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ బెంజిమెన్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మున్సిపల్ స్కూల్‌లో శిక్షా సప్తాహ్‌లో భాగంగా క్రీడా దినోత్సవం కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం (2020) అమలు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జూలై 22 నుండి 29 వరకు 'శిక్షాసప్తాహ్' కార్యక్రమం నిర్వహిస్తుంది. అందులో భాగంగా బుధవారం క్రీడాదినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు లచే ఆటల పోటీలు నిర్వహించారు రన్నింగ్, స్కిప్పింగ్ బాల్ క్యాచ్ పోటీలు నిర్వహించి గెలిచిన విద్యార్థినీ విద్యార్థులుకు బహుమతి ప్రదానం చేయడం జరిగింది. చిలకలూరిపేట పట్టణంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే సుధ మాట్లాడుతూ విద్యార్థులు ఆటల పోటీలు పాల్గొనడం వల్ల శారీరక మానసిక ఉల్లాసం పెరుగుతుందని అన్నారు. ఈ పోటీల వల్ల విద్యార్థులకి పోటీతత్వం అలవడుతుంది అని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు, ఏ నీలిమ, పేరెంట్స్ కమిటీ సభ్యులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



విశాలాంధ్ర-తాడేపల్లి : గుర్రం జాషువా సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా జాషువా సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు దర్శనపు శామ్యూల్, తుడిమెల్ల వెంకటయ్య ఆధ్వర్యంలో 30 మంది వృద్ధులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సేవా సమితి సభ్యులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పోలీస్ సంఘం చీఫ్ అడ్వైజర్ (సలహాదారు) అద్దేపల్లి గణపతి మాట్లాడుతూ జాషువా సమాజంలోని సామాజిక రుగ్మతలను తన కలంతో ఎదుర్కొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో గుర్రం జాషువా సేవా సమితి కోశాధికారి చొప్పర బుల్లిబాబు, పేరుకే బాబు, సభ్యులు బూదాల బాబు, బూదాల ద్రాక్షావల్లి, మైకల్ పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింటు ప్రకాశం జిల్లా, వెలిగండ్ల మండలం, కంకణంపాడు అగ్రహారం గ్రామ నివాసి కల్లు వెంకట స్వామి రెడ్డి గారి కుమారుడు చిర్రారెడ్డి, సెల్ : 9492816531 ఇచ్చిన సమాచారం మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

వినుకొండ ఎస్.ఆర్.ఓ నందు మా క్లయింటు కల్లు చిర్రారెడ్డి పేర రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు ద.నెం.2729/1983, ది.22-08-1983ను మా క్లయింటు శావల్యాపురం మండలం, కొత్తలూరులోని తన పొలం వద్దకు వెళ్తుండగా ది.18-07-2024న సదరు దస్తావేజు మార్గమధ్యలో జారి పడిపోయినది. తదుపరి ఈ దస్తావేజు కొరకు వెతికినను కనిపించలేదు. ఈ దస్తావేజులు ఎవరికైనా దొరికినయెడల పై తెలిపిన నా అడ్రస్‌కు కానీ లేక మా క్లయింటు అడ్రస్‌కు కానీ వెంటనే అందజేయగలరు.

పి. సైదారావు, బి.కామ్, బి.ఎల్,
అడ్వకేట్, లాయర్స్ స్ట్రీట్, కొత్తపేట,
వినుకొండ టౌన్, పల్నాడు జిల్లా.
సెల్ : 9440825595
saidarao.potluri@gmail.com